క్లుప్తంగా

కైకరంలో పుస్తకావిష్కరణ



కైకరంలో పుస్తకాన్ని ఆవిష్కస్తున్న శ్రీనివాసరావు తదితరులు

ఉంగుటూరు: ప్రసిద్ధ కవి జటావల్లభుల సూర్యనారాయణ శాస్త్రి రచించిన సంపూర్ణ భద్రాద్రి మహత్యం, రామత్వం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన డాక్టరు ధూళిపాళ మహదేవి మణి అధ్యక్షత వహించారు. పంచ మముద్రణకు నోచుకున్న భద్రాద్రి మహత్యం రామత్వం కాల పరీక్షకు నిలిచే రచనలని మణి అన్నారు. ఈ కార్యక్రమంలో గిడుగు వెంకటాచలపతిరావు, ఇనుగంటి ఉమారామారావు, సుబ్రమణ్యం దీక్షితులు, ముత్య రమేష్, రాలంపల్లి సూర్యభగవాన్లు, సుబ్రహ్మణ్యం, కొచ్చర్లకోట శ్రీనివాసు, డా. సాయిరామ్ పాల్గొన్నారు.

వైభవంగా కోట్లమ్మ సంబరం



చేబ్రోలు కోట్లమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: చేబ్రోలు కోట్లమ్మ సంబరం ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామదేవత కోట్లమ్మ తల్లిని గ్రామస్తులు దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో కమిటీ సభ్యులు స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా ఈసీ మెంబర్ రాంబాబుకు సత్కారం



దెందులూరులో పోకల రాంబాబును సత్కరిస్తున్న నాయకులు

దెందులూరు: వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా నియమితులైన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబును ఆదివారం సచివాలయ కన్వీనర్లు, ఎండీఓ ఆపరేటర్లు, వలంటీర్లు సత్కరించారు. సచివాలయం-1 కన్వీనర్ ధనికొండ దుర్గారావు, ఎండీఓ ఆపరేటర్ ఏసు, గృహసారధులు అశోక్‌కుమార్, చిన్నారావు, సుంకర లక్ష్మణరావు, వలంటీర్లు వెంకట్రాజు, శివరామకృష్ణ పోకల రాంబాబును సత్కరించారు.

గ్రంథాలయాల్లో సామూహిక పుస్తక పఠనం



భీమడోలు శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న మండే సుధాకర్

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలు ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన చిన్నారులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యం వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

సమాజహితం కోసం మానవత కృషి



యర్రమిల్లిపాడులో మాట్లాడుతున్న అధ్యక్షుడు గంజి రవి

ఉంగుటూరు: మానవత సేవా సంస్థలో సభ్యులుగా చేరి బలోపేతం చేయాలని మానవత సంస్థ రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపి అన్నారు. ఆదివారం యర్రమిల్లిపాడులో మానవత మండల అధ్యక్షుడు గంజి రవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమాజహితం కోసం పనిచేస్తున్న మానవతలో ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరాలని, సేవాభావంతో పనిచేయాలని గోపి కోరారు. గంజి రవి మాట్లాడుతూ సభ్యులను చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యర్రమల్లిపాడు సర్పంచి తమ్మిన శ్రీనివాసరావు, మానవత సీనియర్ సభ్యుల శీతాల సత్యనారాయణ, గోపినాథపట్నం సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి, కోనే సత్యనారాయణ, కంపెపురవి, పానుకుమాట బాబ్జి పాల్గొన్నారు.

కనుల పండువగా పవిత్రోత్సవాలు

భీమడోలు: గుండుగొలనులోని పురాతన సీతారామ స్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఆలయంలో ఏటా లోక కల్యాణార్థం, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగారాజ్‌కుమార్ ఆధ్వర్యంలో రెండో రోజైన ఆదివారం అర్చకుడు సుధీరాచార్యులు, అర్చకులు శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, వాస్తు హోమం, పవిత్ర ప్రతిజ్ఞ, ప్రధాన హోమ పూజలు కనుల పండువగా జరిగాయి. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టీ కొండ గంగారాజ్‌కుమార్, అర్చకులు స్వామి వారి ఆలయ ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈనెల 28వ తేదీ సోమవారంతో ఈ పూజా కార్యక్రమాలు పూర్తవుతాయని వారు తెలిపారు.



భీమడోలు: గుండుగొలనులో సీతారామస్వామి ఆలయంలో శాంతిహోమం నిర్వహిస్తున్న పూజారులు

వైభవంగా బీరయ్య దేవుని ఉత్సవం

పెదపాడు: ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని వైఎస్సార్ సీపీ నాయకులు, కొత్తూరు సర్పంచ్ కడిమి పద్మావతి గోవిందరావు అన్నారు. కురుమ కులస్తుల ఆరాధ్య దైవం బీరయ్య స్వామి జన్మదినం పురస్కరించుకుని ఆదివారం గ్రామంలో పండుగ జరుపుకున్నారు. తొలుత సర్పంచ్ ఇంటి నుంచి మేళతాళాలతో స్వామికి నైవేద్యం, పసుపు కుంకుమలను తీసుకువచ్చి స్వామికి సమర్పించారు. స్వామి వారిని పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. పచ్చిపూలతో ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై బీరయ్య స్వామి, కామ్రావతి అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తరించారు. ఊరేగింపులో కోలాట, శక్తిబేతాళ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కడిమి గోవిందరావు, కురుమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పెదపాడు: బీరయ్య స్వామి, కామ్రావతి అమ్మవారు



పెదపాడు: గ్రామోత్సవంలో పాల్గొన్న కురుమ కులస్తులు



భీమడోలు: స్వామి వారి ఆలయ ప్రదక్షిణలో పాల్గొన్న ట్రస్టీ కొండ గంగారాజ్‌కుమార్

అభివృద్ధి అదరహో..

- నాలుగేళ్లలో రూ.388.55 కోట్లు ఖర్చు
- అభివృద్ధి పనులకు రూ.106.40 కోట్లు
- సంక్షేమ పథకాలకు రూ.282.15 కోట్లు
- అభివృద్ధి బాటలో ఏలూరు మండల గ్రామాలు

ఏలూరు రూరల్: ఏలూరు మండలం దెందులూరు నియోజకవర్గ 15 గ్రామాల్లో ప్రభుత్వం ఒకపక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, మరో పక్క అభివృద్ధి పనులు చేపట్టి పల్లె ప్రజల జీవితాల్లో వెలుగులు నింపింది. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, మౌలిక వసతులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన జీవనస్థితి కల్పించింది. పంచాయతీ, జెడ్పీ, మండల పరిషత్ వ్యవస్థలు ఏర్పడిన నాటి నుంచి నేటివరకూ ఏ ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వలేదని ప్రజలు, ప్రజాప్రతినిధులు చెప్పుకుంటున్నారు.


అభివృద్ధి పనులతో కొత్త పుంతలు

గతంలో ఎన్నడూ లేని విధంగా మల్కాపురం, చాటపర్రు, మాదేపల్లి, జాలిపూడి, శ్రీపర్రు, కలకుర్రు, కాట్లంపూడితో పాటు లంకగ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయి. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు రూ.100 కోట్లతో చేపట్టిన అర్బన్ ప్రాజెక్టు ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఇప్పటి వరకూ గ్రామాల్లో 11 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. రూ.10 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో సుమారు 20 కిలోమీటర్ల దూరం తాగునీటి పైప్‌లైన్, ఇంటింటికీ కుళాయి వేశారు. మరోపక్క సుమారు రూ.కోటి 40 లక్షల మండల పరిషత్ నిధులతో కొక్కిరాయిలంకలో గ్రావెల్ రోడ్లు, మల్కాపురంలో డ్రెయినేజీ, పైడచింతపాడులో సీసీరోడ్లు, మాదేపల్లి, చాటపర్రులో ఫిల్టర్‌బెడ్లు మరమ్మతులు, బోర్లు తవ్వించారు. తిమ్మారావుగూడెం, కోటేశ్వరదుర్గాపురంలో సుమారు రూ.12 లక్షలతో కల్వర్టులు కట్టారు. రూ.20 కోట్లతో కైకలూరు రోడ్డు, శ్రీపర్రు వంతెన నిర్మాణం జరిగింది. ఇదే క్రమంలో మరో రూ.4 కోట్లతో కొల్లేరు రోడ్డు అభివృద్ధి జరుగుతోంది. దీనికి తోడు గ్రామానికి సుమారు రూ.కోటి చొప్పున మొత్తంగా 15 గ్రామాల్లో సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ క్లినిక్ భవనాల కోసం రూ.15 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మరో రూ.3 కోట్ల నాడు-నేడు నిధులతో పాఠశాలలు అభివృద్ధి చేశారు. విద్యుత్‌శాఖ రూ.3.50 కోట్లతో గుడివాకలంకలో సబ్‌స్టేషన్ నిర్మిస్తోంది. జగనన్న కాలనీల్లో వేలాది కరెంట్ స్తంభాలు, పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తోంది. మొత్తంగా నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం 500కు పైగా అభివృద్ధి పనులు చేపట్టి సుమారు రూ.106.40 కోట్లు ఖర్చు చేయనున్నారు.





మల్కాపురంలో రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ 3.5 కోట్లతో గుడివాకలంకలో సబ్‌స్టేషన్ నిర్మాణం





మాదేపల్లిలో నిర్మించిన ట్యాంక్, సంపు, నాడు-నేడు నిధులతో గుడివాకలంకలో జెడ్పీ పాఠశాల తరగతి గదుల నిర్మాణం (ఫైల్)

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నాయి. అమ్మవడి, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీతో మొత్తంగా 26 సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 61,310 మంది లబ్ధిదారులకు మేలు చేశారు. ఒకొక్క కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు లబ్ధిదారులు ఉండడం విశేషం. నాలుగేళ్ల పాలనలో రూ.282,15,30,12,000 పేదలు అందుకున్నారు. అంటే ఏడాదికి రూ.70,53,82,503 విడుదల చేశారు.

అభివృద్ధే ప్రధాన లక్ష్యం



మండలంలో అభివృద్ధి వేగంగా జరిగింది. అభివృద్ధి వెనుక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కృషి ఎంతో ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. మండలంలో ప్రతి గ్రామంపై ఆయన దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తున్నారు.

– పెనుమత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

సీసీ రోడ్లు వేశారు



ప్రభుత్వం మా గ్రామంలో జగనన్న కాలనీ అభివృద్ధి చేసింది. లక్షల రూపాయలు వెచ్చించి ఇళ్ల స్థలాలు మెరక చేయించి, రోడ్లు, కరెంట్ సౌకర్యాలను కల్పించారు. 100 మందికి పైగా పేదలు ఇళ్లస్థలాలు అందుకున్నారు. ఒకొక్క ఇంటికి రూ.1.80 లక్షలు ఇచ్చింది. గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ క్లినిక్ కడుతున్నారు. మండల పరిషత్ నిధులతో సీసీరోడ్లు వేశారు.

– ముంగర తిమోతీ, పైడిచింతపాడు సర్పంచ్

కొనసాగుతున్న పాతూరు ట్రాక్ మరమ్మతులు

భీమడోలు: జాతీయ రహదారి పక్కనే ఉన్న పాతూరు వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు ట్రాక్‌కు అత్యవసర మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో గేటు మూసి వేస్తున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. 27వ తేదీ నాటికి కూడా పనులు కొనసాగుతున్నాయి. సాంకేతిక కారణాలతో పాటు వర్షాలు కురవడంతో పనులకు ఆటంకం కలిగిందని అధికారులు చెప్పారు. ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే సూరప్పగూడెం గ్రామ ప్రజలు, రైతులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సూరప్పగూడెం ప్రాంత రైతులకు పాతూరు ఏరియాలోని వరి క్షేత్రాలకు వెళ్లాలంటే ఈ గేటు దాటాల్సిందే. ట్రాక్ మరమ్మతులతో రైతులు వెళ్లేందుకు అవకాశం లేక నానా తిప్పలు పడుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని రైతులు కోరుకుంటున్నారు.



పాతూరులో ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో మూసి ఉన్న గేటు

చర్మకారుల అభివృద్ధికి రుణాలు మంజూరు చేయాలి

పెదవేగి : రాష్ట్రంలో చర్మకారుల అభివృద్ధి కోసం లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలని దళిత సేన డిమాండ్ చేసింది. ఆదివారం పెదవేగి మండలం కూచింపూడిలో ఏలూరు జిల్లా చర్మకారుల సమావేశం ఏలూరు జిల్లా దళిత సేన మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో చర్మకారుల అభివృద్ధి, సంక్షేమం, సాధికారత కోసం ఇటీవల కేంద్ర ప్రభుత్వం లెదర్ పార్కులు ఏర్పాటు నిమిత్తం కోట్లాది రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు. ఆ నిధులతో చర్మకారుల నైపుణ్య అభివృద్ధి కోసం విజయవాడ ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన ట్రైనింగ్ సెంటర్‌ను త్వరితగతిన ప్రారంభించాలని అన్నారు. చర్మకారులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి వారికి సబ్సిడీపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ రుణాలు మంజూరు చేసి యూనిట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లీడ్ క్యాప్) ఎండీ డోల శంకర్ దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లీడ్ క్యాప్ పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా దళిత సేన కార్యదర్శి పింగుల ఇదియా, ఏలూరు జిల్లా సలహా అధ్యక్షుడు రావూరి నాగేశ్వరరావు, పెదవేగి మండలం అధ్యక్షులు చొదిమెళ్ళ సుబ్బారావు, లింగపాలెం మండల దళిత సేన మహిళా అధ్యక్షురాలు పింగుల విజయమ్మ లింగపాలెం మండల యూత్ కార్యదర్శి తగరం దేవదాస్, కూచింపూడి దళిత సేన నాయకులు సుబ్బారావు ప్రకాశరావు వెంకన్న, భారీ సంఖ్యలో చర్మకారులు పాల్గొన్నారు.

లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలి

దెందులూరు: రాష్ట్రంలో చర్మకారుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కోట్లాది రూపాయలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, లిడ్ క్యాప్ ఎండీ వెంటనే లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. మండలాల పర్యటనలో భాగంగా ఆదివారం దెందులూరు వచ్చిన ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చర్మకారులు జీవన విధానం, అభివృద్ధి, సంక్షేమం అమలుకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణాలివ్వాలని, యూనియన్ ఏర్పాట్లు, చర్మకారుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులపై ఉన్నతాధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆయన కోరారు.

లయన్స్ సేవలు అభినందనీయం

పెదవేగి : మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతోపాటు కుట్టు మిషన్లు అందజేసిన 315 జి ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ పేర్కొన్నారు. పెదవేగిలోని ఎస్ఎంసీ ఉన్నత పాఠశాలలో పలు సేవా కార్యక్రమాల్లో గవర్నర్ మాణిక్యాలరావు, లయన్స్ క్లబ్ ఏలూరు విజన్ అధ్యక్షురాలు చుక్కా పావనితో కలిసి ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ చేతి వృత్తుల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని అన్నారు. ముందుగా ముందు మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ సహకారంతో 120 సైకిళ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు నిత్యావసర సరుకులను అందజేశారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఉపాధ్యాయులకు, మహిళలకు, విద్యార్థులకు నా మొక్క, నా శ్వాస కార్యక్రమంలో భాగంగా 5 వేల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్లోబల్ సర్వీస్ కో ఆర్డినేటర్ చుక్కా అవినాష్ రాజు, సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజేస్, కె. పద్మావతి, పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..



పెదవేగిలోని ఎస్ఎంసీ ఉన్నత పాఠశాలలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

మదర్ థెరిస్సా సేవలు ఆదర్శనీయం

ఏలూరు (టూటౌన్) : మదర్ థెరిస్సా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తోటి వారికి సాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య అన్నారు. స్థానిక రమామహల్ సెంటర్లో మదర్ థెరిస్సా పెయింటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం థెరిస్సా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమయ్య మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే స్ఫూర్తితో ఎనలేని సేవలందించిన మదర్ థెరిస్సా జీవనం అందరికీ ఆదర్శ ప్రాయమని అన్నారు. యూనియన్ వ్యవస్థాపకులు అయినపర్తి మాధవరావు, తమ్మినేని నాగరాజు, బి.సోమయ్య మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి బంగారు బాబు, సహాయ కార్యదర్శి పి.రాము, శేఖర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ ప్రక్షాళన

ఏలూరు రూరల్: ఏలూరు 15వ డివిజన్ నెహ్రూనగర్‌లో కార్పొరేషన్ అధికారులు ఆదివారం డ్రెయినేజీ ప్రక్షాళన చేపట్టారు. కొద్దిరోజులుగా పరిసర ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ చెత్తాచెదారంతో పూడిపోయింది. పిచ్చిమొక్కలు పెరిగి మురుగునీరు కిందకు పారడం లేదు. దీంతో పరిసర ప్రాంత ప్రజలు సమస్యను స్థానిక కార్పొరేటర్ తంగెళ్ల రాము దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రాము శానిటేషన్ అధికారులకు సమాచారం అందించి పొక్లెయిన్‌తో డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టారు. పొక్లెయిన్‌తో డ్రెయినేజీ మొత్తం ప్రక్షాళన చేసి, మురుగునీరు పారుదలకు మార్గం సుగమం చేశారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా నాగ సత్యం ప్రమాణ స్వీకారం

ఏలూరు (టూటౌన్) : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా ఏలూరు నగరానికి చెందిన నెరుసు నాగ సత్యం ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. తిరుమలలోని జయ, విజయ ద్వారం వద్ద నెరుసు నాగ సత్యం చేత ఆలయ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయనకు స్వామి వారి చిత్ర పటాన్ని, పట్టు వస్త్రాలను అందజేశారు. ప్రమాణస్వీకారం అనంతరం నెరుసు నాగ సత్యం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగ సత్యం కుటుంబ సభ్యులు, ఏపీ ఎన్జీవోస్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నెరుసు వెంకట రామారావు, నెరుసు వెంకటచలపతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాపునేస్తం అమలుపై హర్షం

దెందులూరు: కాపు, ఒంటరి, బలిజ సామాజిక వర్గాలకు చెందిన మహిళల ఆర్థికాభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కాపు నేస్తం పథకం అమలు చేయడం ఎంతో మంది కాపు కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపాయని కాపు సంఘం దెందులూరు నియోజకవర్గ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ఈసీ మెంబర్ పోకల రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపునేస్తం 4వ విడత సొమ్మును విడుదల చేయనున్నారని, అర్హత ఉన్న మహిళల ఖాతాల్లో రూ. 15 వేలు చొప్పున జమ కానుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాపులంతా వైఎస్సార్ సీపీ తోనే ఉంటారని పోకల రాంబాబు అన్నారు.

కైకరంలో నేడు గడపగడపకు..

ఉంగుటూరు: కైకరం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని మంగరావు కోరారు.

దర్శనాల కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

దెందులూరు: వైఎస్సార్ సీపీ నాయకులు దర్శనాల సోమేశ్వరరావు కుటుంబ సభ్యులను ఆదివారం దెందులూరులో వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పార్టీ జిల్లా ఈసీ మెంబర్ పోకల రాంబాబు పరామర్శించారు. సోమేశ్వరరావు మృతి చెందడం తాము జీర్ణించుకోలేకపోతున్నామని, పార్టీ దర్శనాల కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పరామర్శించినవారిలో సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, గొరిపర్తి శ్రీనివాసరావు, వార్డు మెంబరు కృష్ణవేణి, సచివాలయ కన్వీనర్ దుర్గారావు తదితరులు ఉన్నారు.

వేళంగిణి ఆరోగ్యమాత ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: ప్రతి ఒక్కరూ దేవుని ఆజ్ఞలకు అనుగుణంగా ప్రేమ, సేవ, దయా గుణంతో ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. ఆదివారం వేగవరం పారిస్ క్రిస్టు ఫాదర్ మోజెస్, విచారణ సంఘ పెద్దలు, గ్రామస్తులు, ఉపదేశీయుల ఆధ్వర్యంలో వేళంగిణి ఆరోగ్యమాత ఉత్సవాలను పొలిమేర జయరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫాదర్లతో జయరావు దివ్యబలి పూజ అర్పించారు. సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ పారిస్ క్రిస్టు ఫాదర్ మోజెస్, సంఘ పెద్దలు సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.



వేగవరంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న పొలిమేర జయరావు

పేకాట స్థావరంపై దాడి

పెదవేగి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం కొప్పాకలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేయగా, ఘటనా ప్రదేశంలో రూ.2,100 నగదు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజకీయ పక్షాల రౌండ్ టేబుల్ సమావేశం ఏలూరులో ఆదివారం నిర్వహించారు. అగ్రిగోల్డ్‌లో డిపాజిట్ చేసిన సొమ్ము దాని ఆస్తుల విలువ కన్నా తక్కువ ఉన్నందున ప్రభుత్వం జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ చంద్రశేఖర్, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.